క్లుప్తంగా

వాల్మీకిపురం సీఐగా క్రిష్ణయ్య



వాల్మీకిపురం: వాల్మీకిపురం నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా క్రిష్ణయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అలాగే నాటుసారా తయారీ, విక్రయాలు, మద్యం అక్రమ రవాణా, జూదం తదితర వాటిపై గట్టి నిఘాపెట్టి ఎంతటివారైనా ఉపేక్షించక పూర్తి స్థాయిలో అరికట్టే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి గస్తీలు ముమ్మరం చేస్తామన్నారు. ప్రజలు కూడా పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించాలని కోరారు.

825 గ్రూపులకు ఆసరా డబ్బులు

గుర్రంకొండ: మండలంలోని 825 డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ మూడవ విడత ఆసరా డబ్బులు జమ అయినట్లు ఏపీఎం వెంకటరమణ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ముడవ విడత వైఎస్సార్ ఆసరా డబ్బులు గతంలో 645 గ్రూపులకు మాత్రమే వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. రెండు రోజుల క్రితం మిగిలిన సంఘాలన్నింటికీ సంబంధించిన ఆసరా డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయని అన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులు బ్యాంకులకు వెళ్లి డబ్బులు తీసుకోవచ్చన్నారు.

మునిగోపాలకృష్ణకు సన్మానం

మదనపల్లె సిటీ: కర్నూలులోని శ్రీ శ్రీ కళావేదిక, కవితా వసంతం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు మునిగోపాలకృష్ణను సన్మానించారు. కార్యక్రమంలో ఆయన కవితలు వినిపించారు. కళావేదిక అధ్యక్షులు నారాయణరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌పై శిక్షణ

తంబళ్లపల్లె: వైఎస్సార్‌క్రాంతిపథంలో పనిచేస్తున్న వీవోఏలకు లోకోస్ యాప్‌పై శిక్షణ ఇస్తున్నట్లు ఏరియా కోఆర్డినేటర్ సురేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక స్త్రీ శక్తిభవన్‌లో సోమవారం, మంగళవారం రెండు రోజులపాటు వీవోఏలకు రీసోర్సు పర్సన్ మహ్మద్‌బాషా శిక్షణ ఇస్తారన్నారు. మొదటిరోజు యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం, వినియోగం అంశాలపై వివరించారు. ఏపీఎం గంగాధర్, సీసీలు పాల్గొన్నారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

తంబళ్లపల్లె: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఆనంద్‌కుమార్ కోరారు. కుక్కరాజుపల్లె క్లస్టర్–1, బాలిరెడ్డిగారిపల్లె క్లస్టర్–6, పంచాలమర్రి క్లస్టర్–12(ఓసీ) అభ్యర్థులకు రిజర్వేషన్ కేటాయించారని, కోసువారిపల్లె క్లస్టర్ బీసీ అభ్యర్థులు ఈ నెల 25లోగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27, 28వ తేదీలలో సెలక్షన్ కమిటీ సభ్యులు ఇంటర్వ్యూ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు.

సారా విక్రేత అరెస్టు

నిమ్మనపల్లె: సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 5 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. సోమవారం తవళం గ్రామానికి చెందిన చినప్పరెడ్డి తవళం క్రాస్ సమీపంలో సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితులనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

25న మండల సర్వసభ్య సమావేశం

కలకడ: మండల సర్వసభ్య సమావేశంలో అందరూ పాల్గొని మండల అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ఎంపీడీఓ గంగయ్య కోరారు. ఈనెల 25న మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

26న కలికిరిలో..

కలికిరి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 26న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన జరుగనున్న సమావేశానికి అన్ని గ్రామ పంచాయతీల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరవ్వాలని కోరారు.

కర్నాటక మద్యం స్వాధీనం

ములకలచెరువు : అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యం స్వాధీనం చేసుకొని ఒక నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ కథనం మేరకు... ములకలచెరువు సర్కిల్ పరిధిలోని పీటీయం మండలం కమ్మచెరువు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంలో కర్నాటక మద్యం తరలిస్తున్న సత్యసాయి జిల్లా తనకల్లు మండలం మల్‌రెడ్డిపల్లెకు చెందిన బాలక్రిష్ణ(31) పట్టుబడ్డాడు. ఈ దాడుల్లో 96 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

స్పందన అర్జీలపై స్పందించాలి

తంబళ్లపల్లె: ప్రభుత్వం అమలు పరుస్తున్న స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై వీఆర్వోలు స్పందించాలని తహసీల్దార్ భీమేశ్వర్‌రావు తెలిపారు. సోమవారం వీఆర్వోలతో సమావేశం జరిగింది. ప్రజలకు అందుబాటులో ఉండి , సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు.

మెరుగైన సేవల కోసం ‘జగనన్నకు చెబుదాం’

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన ఆర్డీఓ మురళి



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : స్పందన కార్యక్రమాన్ని మరింత మెరుగుపరిచి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్రప్రభుత్వం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఆర్డీఓ ఎం.ఎస్. మురళి అన్నారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను నేరుగా తెలుసుకుని అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించే ప్రయత్నం చేశారు. మదనపల్లె మండలం చిన్నతిప్పసముద్రంకు చెందిన కొండపల్లెసులోచన తమకు చెందిన సర్వేనెంబర్.1007 భూమిలో ఇరిగేషన్ అధికారులు తమకు ముందస్తు సమాచారం తెలపకుండా, ఎటువంటి పరిహారం అందించకనే కానుగచెట్లును తొలగించి జేసీబీతో రోడ్డువేశారన్నారు. ఈ విషయమై మండల తహసీల్దార్, ఇరిగేషన్ డీఈ, ఆర్డీఓకు గతంలో అనేకమార్లు స్పందనలో వినతులు చేసుకున్నా ఎలాంటి పరిష్కారం లభించలేదన్నారు. దీంతో ఆమె సబ్‌కలెక్టరేట్ నుంచి 1902కు ఫోన్‌చేసి తమ సమస్యను విన్నవించారు. ములకలచెరువు మండలం దేవల్‌చెరువు గ్రామం పర్తికోటకు చెందిన దళితులు తమ కులం వారికి చెందిన సమాధులను గ్రామానికి చెందిన కాట్లగంటి నరసింహారెడ్డి ధ్వంసం చేస్తున్నాడని ఆర్డీఓ ఎం.ఎస్.మురళికి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వేనెం.817లోని భూమిని 40 ఏళ్లగా శ్మశానంగా వినియోగిస్తుండగా, నర్సింహారెడ్డి ఆ భూమి తనదేనని దౌర్జన్యం చేస్తున్నాడన్నారు. సదరు భూమిలో తమ పొజిషన్‌పై తంబళ్లపల్లె కోర్టు ఇంజక్షన్ మంజూరుచేసినా తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కమిషనర్ కే.ప్రమీల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పట్టణంలో జ్యోతిరావు, సావిత్రీభాయిపూలే విగ్రహ ఏర్పాటుకు అనువైన స్థలం కేటాయింపు అంశాన్ని కౌన్సిల్ సమావేశం అజెండాలో పొందుపరిచి ఆమోదించాల్సిందిగా గ్రామజ్యోతి సొసైటీ డైరెక్టర్ సుభద్ర వినతిపత్రం సమర్పించారు. అయోధ్యానగర్, రింగ్‌రోడ్డుకు చెందిన కాలనీవాసులు తమ ప్రాంతంలో కాలువలను శుభ్రంచేసి చెత్త తొలగించాల్సిందిగా వినతిచేశారు. 15రోజులకు ఒకసారి నీళ్లు వదులుతున్నందున కష్టంగా ఉంటోందని, నీటిసమస్య పరిష్కరించాల్సిందిగా కోరారు. ఆర్‌టీఐ యాక్ట్ కింద సమాచారం కోరినా మున్సిపల్ అధికారులు సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం కనపరుస్తున్నారని పటేల్‌రోడ్డుకు చెందిన వెంకటేశ్వరప్రసాద్ ఫిర్యాదు చేశారు.

పీలేరు తహసీల్దార్‌గా ధనుంజయలు



బాధ్యతలు స్వీకరిస్తున్న ధనుంజయలు

పీలేరు రూరల్ : పీలేరు తహసీల్దార్‌గా కె. ధనుంజయలు బాధ్యతలు స్వీకరించారు. గత నెలలో పీలేరు తహసీల్దార్ రవి బదిలీపై కలెక్టరేట్‌కు వెళ్లారు. అప్పటి నుంచి ఎఫ్ఏసీ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కె. ప్రదీప్ విధులు నిర్వర్తించారు. బి. కొత్తకోట తహసీల్దార్‌గా పని చేస్తున్న కె. ధనుంజయలు బదిలీపై పీలేరుకు వచ్చారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రదీప్ ఇదే కార్యాలయంలో డీటీగా కొనసాగుతున్నారు.

జగనన్న గుండెచప్పుడు వలంటీర్ వ్యవస్థ

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



గ్రామ వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గుండెచప్పుడు గ్రామ వలంటీర్ వ్యవస్థ అని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక మార్కెట్ యార్డులో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలబడి సేవాభావంతో పేదల కష్ట సుఖాలను పంచుకుంటూ సంక్షేమ ఫలాలను అందిస్తున్న వలంటీర్లు అభినందనీయులన్నారు. ప్రజల నుంచి పాలకుల వరకు, అధికారుల నుంచి అధిష్టానం వరకు వినపడే నేటి మాట గ్రామ వలంటీర్ వ్యవస్థ అని అభివర్ణించారు. గ్రామ వలంటీర్లు పారదర్శకంగా పని చేస్తూ ప్రభుత్వానికి మంచిపేరు తెస్తుండడంతో ఓర్వలేని టీడీపీ నాయకులు వలంటీర్ వ్యవస్థపై బురదజల్లే వాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. గ్రామ వలంటీర్లు చురుగ్గా వ్యవహరించడం వల్లనే జిల్లాలోనే సంక్షేమ పథకాలు అందించడంలో పీలేరు మండలం మొదటి స్థానంలో ఉండడం గర్వకారణమన్నారు. మండలంలో మొత్తం 350 మంది గ్రామ వలంటీర్లకు గానూ కాకులారంపల్లెకు చెందిన వలంటీర్ రమాదేవికి సేవా వజ్ర (రూ. 30వేలు) అందించి అభినందించారు. అలాగే సేవారత్నం ఐదు గురికి, 344 మందికి సేవామిత్ర అవార్డులతో దుశ్శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు హుమయూన్, మహితాఆనంద్, మస్తాన్, రెడ్డిబాషా, చలపతి, నాగరాజమ్మ, అమరనాథరెడ్డి, నరసింహారెడ్డి, కాలనీ చిన్న, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ పథకాల పంట

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటా సంక్షేమ పంట పండుతోందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే గూడరేవుపల్లె పంచాయతీ మర్రిమాకులపల్లె తాండా, మర్రిమాకులపల్లె, పుట్టావాండ్లపల్లె, బెస్తపల్లె, రామానాయక్ తాండా తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి నాలుగేళ్లలో పొందిన లబ్ధి వివరాలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త ఆలోచనలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తీసుకొచ్చిన సమస్యలు అప్పటికప్పుడే సంబంధిత కారులకు తెలిపి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ కృష్ణమ్మ, సర్పంచ్ హబీబ్‌బాషా, నాయకులు బద్రేనాయక్, వినాయక, సీకే, శ్రీహరిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: మండలంలో జరిగిన అభివృద్ధిని చూసి మరోమారు వైఎస్సార్‌సీపీ ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కోరారు. సోమవారం బీఆర్ గెస్ట్‌హౌస్‌లో ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డితో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో మారుమూల గ్రామాలకు బస్సు సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని, బి.కొత్తకోటలో డిపో ఏర్పాటు నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం మండల కేంద్రంలో పర్యటించారు. సర్పంచ్ నీలూఫర్, మైనుదీదన్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తల సమష్టిగా పనిచేసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. సంక్షేమ పథకాలతో పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ మరోవైపు నాడు–నేడు కార్యక్రమంతో పాఠశాలలు, ఆసుపత్రుల అభివృద్ధి చేసి సామాన్యులకు విద్య, వైద్యం అందేలా పాలన సాగిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. నాయకులు, కార్యకర్తలు ప్రజలను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, సింవిల్‌విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌడేశ్వర్, మల్లయ్యకొండ ఆలయ చైర్మన్ మల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

కనుల పండువగా కల్యాణోత్సవం



శివపార్వతుల కల్యాణోత్సవ దృశ్యం

పెద్దతిప్పసముద్రం: స్థానిక ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా వేద పండితులు ఆలయంలోని శివ పార్వతుల ప్రతిమలకు అలంకరించి స్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

జగనన్న విద్యాకానుక నాణ్యత పరిశీలన



జేవీకె శాంపిల్ కిట్‌ను ప్రదర్శిస్తున్న ఎంఈఓ రాజగోపాల్, సిబ్బంది

నిమ్మనపల్లె: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యాకానుక ద్వారా అందించనున్న శాంపిల్ కిట్‌ను ఎంఈఓ రాజగోపాల్ పరిశీలించారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో జేవీకె శాంపిల్ కిట్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేవీకె ద్వారా అందించే శాంపిల్ కిట్ క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారిచే అందిందన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికిగాను మండలంలోని 3256 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుకను పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా అందించనున్నట్లు తెలిపారు. ఒకొక్క విద్యార్థికి 3 జతల యూనిఫాం, షూ, బెల్ట్, బ్యాగు, టిక్కు, నోటు పుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీతో పాటు అందిస్తామన్నారు. మండలానికి 36 వేల పుస్తకాలు రావాల్సి వుండగా 13 వేల పుస్తకాలు అందాయన్నారు. కార్యక్రమంలో ఐఆర్‌టీ ఉపాధ్యాయులు రామమోహన్, సీఆర్‌పిలు సుదాకర్, పద్మానాభం, మంజుల,స్వాతి, ఎంఐఎస్ కోర్డినేటర్ నరసింహులు,సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ములకలచెరువు: స్థానిక మండల కేంద్రంలో సోమవారం ఎస్ఐ మధురామచంద్రుడు వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల రికార్డులు పరిశీలించారు. ఎస్ఐ మాట్లాడుతూ... మద్యం సేవించి వాహనాలు నడపరాదని డ్రైవర్లకు సూచించారు. రికార్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు.

రైతులకు రాయితీ జొన్నలు పంపిణీ

రామసముద్రం: మండలంలోని పశువైద్యశాలలో సోమవారం రాయితీపై రైతులకు జొన్నలను పంపిణీ చేశారు. ఎంపీపీ కుసుమకుమారి , జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ భాస్కర్‌గౌడు, పశువైద్యాధికారి దివ్యలు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దివ్య మాట్లాడుతూ మండలంలోని రైతులకు జొన్నలు, మొక్కజొన్నలు సబ్సిడి ద్వారా అందించడం జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలకు జొన్న మరియు మొక్కజొన్నలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కావలసిన రైతులు పట్టాపాసు పుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్, మొబైల్ నెంబరును ఆయా పరిధిలోని ఆర్‌బీకేలలో పేరును నమోదు చేయించి జొన్న, మొక్కజొన్నలు పొందాలని కోరారు. అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

విత్తన కాయల పంపిణీపై సమీక్ష

పెద్దతిప్పసముద్రం: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అందజేసే వేరుశనగ విత్తన కాయల పంపిణీపై సోమవారం ఏఓ ప్రేమలత గ్రామ వ్యవసాయ సహాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలోని రైతుభరోసా కేంద్రాలకు 3,200 క్వింటాళ్ల రాయితీ వేరుశనగ విత్తన కాయలు మంజూరు అయ్యాయన్నారు. విత్తన కాయల పంపిణీ సజావుగా నిర్వహించాలని సూచించారు. ముందస్తుగా ఆర్‌బీకే పరిధుల్లోని రైతుల భూమి వివరాల రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియ వేగవంతం చేసుకోవాలన్నారు. భూమి కలిగి ఉన్న రైతు బయోమెట్రిక్ వేస్తేనే కాయలు మంజూరు అవుతాయన్నారు. అర ఎకరం భూమి ఉన్న రైతుకు ఒక బస్తా, ఎకరా లోపు ఉంటే 2 బస్తాలు, ఎకరాపై ఎంత భూమి ఉన్నా మూడు బస్తాలు మాత్రమే పంపిణీ చేయాలని ఏఓ స్పష్టం చేశారు.

భూపంపిణీ చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మికసంఘం, బీకేఎంయూ, సీపీఐ నాయకులు

మదనపల్లె : ఎనిమిదో విడత భూపంపిణీ ద్వారా ప్రభుత్వ సాగు, మిగులు భూములను దళితులకు, గిరిజనులకు పంపిణీ చేయాలని బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణప్ప డిమాండ్ చేశారు. సోమవారం మదనపల్లె సబ్‌కలెక్టర్ ఆఫీస్ ఎదుట బీకేఎంయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణప్ప మాట్లాడుతూ దళితులు, గిరిజనులు, వ్యవసాయ కూలీలు, సన్న, చిన్నకారు రైతులు భూములు లేక వ్యవసాయకూలి పనులను నమ్ముకుని దుర్భర పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారన్నారు. వ్యవసాయం చేసుకునేందుకు భూమిలేని ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ పేదలందరికీ ఎనిమిదో విడత భూపంపిణీ కార్యక్రమంలో అసైన్మెంట్ కమిటీ ద్వారా భూ పంపిణీ చేపట్టి పట్టా పాసుబుక్కులు మంజూరు చేయాలన్నారు. మదనపల్లె రెవెన్యూడివిజన్ ములకలచెరువు మండలం గుడిపల్లె గ్రామం చెన్నప్పగారిపల్లెగడ్డ శోత్రియంభూమి 1995 నుంచి ఇప్పటివరకు బీడు భూముగా ఉందన్నారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం, బీకేఎంయూ భారత కమ్యూనిస్టుపార్టీ, సీపీఐ ఆధ్వర్యంలో అనేకసార్లు ఉద్యమాలు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే గుడుపల్లె గ్రామం చెన్నప్పగారిపల్లె గడ్డ వద్ద ప్రభుత్వభూమిని గూడుపల్లె, సోంపల్లె, చౌడసముద్రం, కాలువపల్లె, బురకాయలకోట ఎస్సీ కాలనీ, ఎర్రదొడ్డిగారిపల్లె, రంగనాయనిపల్లె, నల్లగుట్టపల్లె, తిమ్మారెడ్డిగారిపల్లెలో నివసిస్తున్న దళితులకు బురకాయలకోట గ్రామంలో వివిధ సర్వేనెంబర్లలో ఉన్నటువంటి ప్రభుత్వభూమిని పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో కే.అంజనప్ప, సలీంబాషా, చంద్రశేఖర్, ఎం.హరికుమార్, జయశేఖర్, దేవ, కమలాకర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరిస్తాం

– డిప్యూటీ కలెక్టర్ సందీప్‌కుమార్

రామసముద్రం: ప్రజల నుంచి వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని స్పెషల్‌ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ సందీప్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన రామసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు స్వీకరించి క్షేత్రస్థాయిలోకి వెళ్లి విచారించి పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. రెవెన్యూ సిబ్బంది ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యం చేయవద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దైవ రాజన్, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నల్లగంగమ్మ జాతర



విశేషాలంకరణలో నల్లగంగమ్మ

కేవీపల్లె : మండలంలోని సొరకాయలపేట పంచాయతీ మిన్నంరెడ్డిగారిపల్లెలో నల్లగంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామంలో వెలసిన నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు చాందినీబండ్లు కట్టి అమ్మవారి ఆలయ ప్రదక్షిణ చేశారు. ఉదయం పలువురు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

అనుమతిలేని లేఅవుట్లలో హెచ్చరిక బోర్డులు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న ఈఓపీఆర్డీ

మదనపల్లె : మండలంలోని కొత్తపల్లె పంచాయతీలో డైరెక్టర్ ఆఫ్ టౌన్ కంట్రీ అండ్ ప్లానింగ్ (డీటీసీపీ) అనుమతి లేకుండా, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వేసిన లేఅవుట్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు ఈఓపీఆర్డీ వెంకటసుబ్బయ్య తెలిపారు. సోమవారం కొత్తపల్లె పంచాయతీ సచివాలయం వెనుకవైపున సర్వేనెం 441లో 3.30, 449లో 6 ఎకరాల స్థలంలో రియల్టర్లు పంచాయతీకి రావాల్సిన కన్వర్షన్ చార్జీలు, 10 శాతం భూమి రిజిస్టర్ చేసి ఇవ్వకుండా వెంచర్లు వేసి అమ్ముతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు గుండామనోహర్ స్పందన కార్యక్రమంలో ఆర్డీఓకు పలుమార్లు అర్జీలు సమర్పించడంతో క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించామన్నారు. అక్రమాలు వాస్తవమని తేలడంతో సదరు లేఅవుట్లలో ఎటువంటి ప్లాట్లు కొనుగోలు చేయవద్దని ప్రజలను హెచ్చరిస్తూ బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయమన్నారు.

వైభవంగా వెంకటరమణస్వామి ఉట్ల తిరునాల



ఉట్లతిరునాలకు హాజరైన భక్తులు

రామసముద్రం: మండలంలోని మినికి గ్రామంలో వెలసిన శ్రీకల్యాణ వెంకటరమణస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీదేవి భూదేవి సమేత వెంకటరమణస్వామి ఉట్ల తిరునాల వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి కలశ ఆరాధన, ప్రత్యేక పూజలు, హోమాలు, మహా మంగళహారతి నిర్వహించారు. అలాగే ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే ఉట్ల తిరునాలను తిలకించారు. భక్తులకు ఆలయ అర్చకులు శ్రీధర్‌బట్టర్ తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి అత్యంత వైభవంగా స్వామివారిని గ్రామంలో ఊరేగించారు.

ఘనంగా కోదండరామస్వామి గ్రామోత్సవం

కలికిరి: మండలంలోని కలికిరి గ్రామ పంచాయతీ చెరువుముందరపల్లిలో ఆదివారం రాత్రి కోదండరామస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా మొదటి రోజు సీతారామలక్ష్మణ హనుమత్ సమేత స్వామి వార్ల మూలవిగ్రహాలను ఊరేగించారు. సోమవారం వేదపండితుల ఆధ్వర్యంలో గణపతిపూజ, గంగపూజ, గోపూజ, నవగ్రహ కలశ స్థాపన, మంగళహారతి, క్షీరాధివాసం ప్రత్యేక పూజలు చేశారు.

వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

– డీపీఎం లోకవర్ధన్

మదనపల్లె సిటీ: వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. సోమవారం జిల్లా ఆస్పత్రిలో ఎమ్ఎల్‌హెచ్‌పీలకు వృత్తి నైపుణ్యాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్లినికల్ మేనేజ్‌మెంట్‌లో సామర్థ్యం పెంపొందించుకోవాలన్నారు. ఎమర్జెన్సీ మెడికల్ కేర్‌లో భాగంగా సిపిఆర్ నిర్వహణ, పాముకాటుకు గురైనవారికి ప్రాణపాయం నుండి కాపాడటంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందు కోసం విజయవాడలో శిక్షణ పొందిన వైద్యులు సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలి, డాక్టర్ రాముమూర్తినాయక్, ఎన్‌సిడి నోడల్ అధికారి డాక్టర్ శేషగిరిబాబు, ఎల్త్‌ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ, డీపీఎంలు వేణుగోపాల్, శంభూప్రసాద్, టీబీ సూపర్‌వైజర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.